సూర్య
17 వ వసంతంలోకి
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
ఆదివారం | 14 జులై 2024 | పేజీలు 8

## మంత్రి 'ఆనం'ను కలిసిన అలఘునాధస్వామి ఆలయ కమిటీ



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని శనివారం ఆత్మకూరులోని శ్రీశ్రీశ్రీ భూదేవి, శ్రీదేవి సమేత అలఘునాధస్వామి ఆలయ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రిని శాలువాతో సన్మానించి అభినందించారు. అలఘునాధుని ఆలయంలో జరుగుతున్న పూజాదికార్యక్రమాల గురించి, నూతనంగా నిర్మాణంలో ఉన్న స్వామివారి కళ్యాణమండపం గురించి వారు మంత్రికి వివరించారు. దేవాదాయశాకా ద్వారా అవసరమైన సౌకర్యాలగురించి వారు మంత్రికి వివరించగా తప్పకుండా చేస్తానని మంత్రి వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఎంసి మాజీ చైర్మెన్ కుడుముల సుధాకర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు చల్లా రవికు మార్‌రెడ్డి, విహెచ్‌పి జిల్లా ఉపాధ్యక్షుడు సోమవరపు యానాదిరెడ్డి, కె.వి.శేషారెడ్డి, పందిపాటి సుధాకర్‌రెడ్డి తది తరులు పాల్గొన్నారు. ఈనెల21వతేదీన ఆత్మకూరులో పెద్దఎత్తున నిర్వహించనున్న హనుమాన్ శోభాయాత్రకు వారు మంత్రి రామనారాయణరెడ్డిని ఆహ్వానించారు.

## సీఎం చంద్రబాబును కలిసిన మేకపాటి దంపతులు



**జలదంకి, మేజర్ న్యూస్ :** రాష్ట్ర ముఖ్యమంత్రి తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడును శనివారం అమరావతిలోని ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయంలో ఉదయగిరి నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ మేకపాటి శాంతికుమారి ఇరువురు చంద్రబాబు నాయుడును కలిసి పుష్పగుచ్చం శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.

## నెల్లూరు జిల్లా ఎస్పీగా జి.కృష్ణకాంత్



**నెల్లూరు క్రైం, మేజర్ న్యూస్ :** నెల్లూరు జిల్లా ఎస్పీగా జి.కృష్ణకాంత్‌ను నియమించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యారు. రాష్ట్రవ్యాప్త ఎస్పీల బదిలీల్లో భాగంగా ప్రస్తుతం నెల్లూరు జిల్లా ఎస్పీగా పనిచేస్తున్న ఆరిఫ్ హఫీజ్‌ను బదిలీ చేశారు. నూతన జిల్లా ఎస్పీగా నియమించిన కృష్ణకాంత్ స్వస్థలం అనంతపురం జిల్లా, గుత్తి మండలం, ఎస్ఎస్‌పల్లె గ్రామం. గతంలో ఆయన కర్నూలు జిల్లా ఎస్పీగా పని చేశారు.



- పెరుగుతున్న ఆదరణ
- ఆకాశం వైపు ధరలు
- ప్రభుత్వ ప్రోత్సాహం కరువు





## కనుమరుగవుతున్న చిరుధాన్యాలు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :**

మారుతున్న నాగరికత, అనుకూలంగా లేని వర్షాల పరిస్థితులు, అతివృష్టి, అనావృష్టి, పెరుగుతున్న సేద్యం వ్యయం, 'మార్కెట్లో అమ్మబోతే అడివి.. కొనబోతే కొరివి' అన్నచందంగా ఉంటుండడం తదితర సవాలక్ష కారణాలతో చిరుధాన్యాల పంటల సాగు గణనీయంగా తగ్గింది. కొన్ని ధాన్యాలైతే కనుమరుగయ్యాయి. జొన్న, సజ్జ, రాగి, కొర్ర, బరిగె, ఆరుక తదితర పంటల సాగు గణనీయంగా తగ్గి ఈ చిరుధాన్యాలు కనుమరుగయ్యాయి. కాగా కొంతకాలంగా కొన్ని ధాన్యాలకు ఆదరణ పెరిగింది. దాంతో వాటి ధరలు కూడా ఆకాశాన్నంటుతున్నాయి. గతంలో ఈ ధాన్యాల ఆహారం అధికంగా ప్రజలు తీసుకునేవారు. అయితే వారిని అనాగరికులుగా సమాజంలో పరిగణించేవారు. నిరుపేదలుగా, ఆర్థిక వెసులుబాటు లేనందున వరిధాన్యం ఆహారంగా తీసుకోలేని పరిస్థితి ఉంటుంది. క్రమీణా నాగరికత పెరుగుతుండడంతో గ్రామీణ ప్రజల్లో కూడా చైతన్యం పెరిగి చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవడం బాగా తగ్గింది. జిల్లాలోని మెట్టప్రాంతాలైన ఆత్మకూరు, ఉదయగిరి, కావలి, రాపూరు తదితర చోట్ల జన్న, సజ్జ, రాగి, కొర్ర, ఆరుక, బరిగె పంటలు బాగా తగ్గిపోవడంతో మెట్టపొలాలు బీళ్ళుగా దర్శనమిస్తున్నాయి. కంది, మినుము,పెసర, ఉలవ, అలసంద తదితర అపరాల సాగు కూడా కనుమరుగైంది. అప్పట్లో చిన్న రైతులు కూడా చిరుధాన్యాలు, అపరాలను పండిస్తుండేవారు. వాటినే అధికంగా ఆహారంగా తీసుకోవడం, వాటి ద్వారా లభించే ముడివ్యర్థాలు, కుడితి పశువులకు ఆహారంగా, బలవర్దకమైన శక్తినిచ్చే ఆహారంగా ఉంటుండేది. జొన్న పంటలో ఆత్మకూరు నియోజకవర్గంలోని కాకివాయి జొన్నకు అత్యంత ప్రాధాన్యత ఉండేది. ఈ నియోజకవర్గంలోనే అప్పట్లో సుమారు 50 వేల హెక్టార్లకు పైచిలుకు జన్న పంట పండిస్తుండేవారని పెద్దల అబిప్రాయాలనుబట్టి అంచనాలుగా ఉండేవి. సజ్జ, రాగి పైర్లు కూడా దాదాపు 25 వేల హెక్టార్లలో పండిస్తుండేవారని చెబుతుండేవారు. దశాబ్దకాలంగా మెట్ట ప్రాంతాల్లో చూస్తుంటే చిరుధాన్యాలు, అపరాల సాగు గణనీయంగా తగ్గగా మినుము మాత్రం వాణిజ్యపంటగా అధికంగా సాగుచేస్తున్నారు. మెట్ట ప్రాంతాల్లో ఈ పైర్లు తగ్గడంతో అధికంగా వర్జీనియా పొగాకు పంట సాగు చేస్తున్నారు. చిరుధాన్యం పంటలు తగ్గడంతో పశుగ్రాసం కొరత, కూలీలకు ఉపాధి తగ్గడం, తదితర పరిణామాలు చేటుచేసుకొని పశుసంపద కూడా తగ్గింది. అయితే క్రమీణా ఆరోగ్యరీత్యా రాగిసంగటి, ఆరుక, కొర్రలు తదితరాలను భుజించడం శ్రేయస్కరమని వైద్యులే చెబుతుండడం, ముమ్మర ప్రచారం జరగడంతో వాటి గిరాకి పెరగడంతో పాటు

-మిగతా 2లో

## పాత పెన్షన్ విధానం అమలు చేయాలి



ఉద్యోగులకు సిపి ఎస్ పెన్షన్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని యుటి ఎఫ్ నాయకులు కోరారు.

వివరాలు 5లో

## చదువుతోనే సమాజంలో ఉన్నత స్థానం

- 212 మంది విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు
- నెల్లూరు జిల్లా కుమ్మర శాలివాహన సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఐలాపురం వెంకయ్య

5 లో



వివరాలు 04లో



## భక్తులకు ఎటువంటి ఇబ్బందులు రానివ్వం

బారాషాహిద్ దర్గా వద్ద ఏర్పాట్లను పరిశీలించిన ట్రస్ట్ బోర్డు కమిటీ సభ్యులు

## గృహనిర్మాణ బకాయిలు హుళక్కేనా ?

3లో..



# నెరవేరని రిజర్వేషన్ ఆశలు

## అమలుకు నోచుకోని హామీలు - అలసిపోయిన ఉద్యమాలు - ఆవేదనతో బెస్త, వాల్మీకి/బోయ, కాపులు



మంత్రి నారాయణకు వినతి అందజేస్తున్న వాల్మీకి సంఘ నాయకులు (ఫైల్ ఫోటో)

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** అనాదిగా తమను రిజర్వేషన్ జాబితాలో చేర్చాలంటూ రాష్ట్రంలో కాపులు, బెస్త, వాల్మీకి/బోయ సంఘీయులు ఎందరెందరో పాలకులకు, అధికారులకు విన్నపాలు చేసినా.. ఆందోళనా కార్యక్రమాలు నిర్వహించినా.. పలువురు నేతలు హామీలిచ్చినా.. వారి ఆశలు నెరవేరలేదు. ప్రభుత్వాలు మారుతున్నా వారి రిజర్వేషన్ ఆకాంక్షలు నెరవేరలేదు. హామీలిచ్చిన నేతలు అధికారంలోకి వచ్చాక పట్టించుకోవడంలేదన్న ఆవేదన, ఆగ్రహం వారిలో కన్పిస్తోంది. దశాబ్ధాల తరబడి మత్స్యకారులైన బెస్త సంఘీయులను ఎస్టీల జాబితాలో చేర్చాలన్న కల నెరవేరలేదు. నేతలెందరో ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోలేదు. మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో ఎన్నో ఉద్యమాలు చేసిన బెస్త సంఘీయులు 2009లో ఢిల్లీలో కూడా ధర్నా చేశారు. అప్పట్లో యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ వారికి హామీ ఇచ్చినా.. అమలు కాకపోగా 2014 నుండి అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వమైనా పట్టించుకోవాలని, మత్స్యకారులైన బెస్త సంఘీయులను ఎస్టీల జాబితాలో చేర్చాలని వారంతో కోరుతూనే ఉన్నా.. తమ కోరిక నెరవేరడం లేదని వారంతా ఆవేదనతో ఉన్నారు. 2009లో వివిధ జిల్లాలకు చెందిన సంఘ నాయకులు 200 మంది డిల్లీకి వెళ్ళగా, నెల్లూరు జిల్లా నుండి ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు పుట్టుబోయిన సుబ్బరాయుడు (ఆత్మకూరు మండలం మహిమలూరు), జిల్లా నాయకులు ఎం.వెంకటేశ్వర్లు,. మద్దినేని నారాయణ, సి.హెచ్.రాజశేఖర్‌లు కూడా వెళ్లి పార్లమెంట్ భవన్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనాదిగా అన్ని రంగాల్లో ఆర్థిక అభివృద్ధికి నోచుకొనక నానా అవస్థలు పడుతున్నా మని, కుల వృత్తితో జీవనం సాగించాలంటే తగిన అవకాశాలు లేవని, తమ కులాన్ని ఎస్టీల జాబితాలో చేర్చితే అన్నిరంగాల్లో సంక్షేమ ఫలాలు అందుకోగలమని, అభి వృద్ధి చెందగలమని కోరారు. యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీని కలిశామని, ప్రణబ్ ముఖర్జీ, చిదంబరం, మీరాకుమారి తదితర కేంద్ర మంత్రులను కూడా కలవగా చర్యలు తీసుకుంటామంటూ హామీలిచ్చారని ఆసంఘ నాయకులు పేర్కొన్నారు. 1970 నుండి పివి.నరశింహరావు, జలగం వెంగళరావు తదితరలంతా ప్రతిపాదించినా తమ సమస్య పరిష్కారానికి నోచుకోలేదన్నారు. దేశంలో ఆరు రాష్ట్రాల్లో మినహా మిగతా చోట్ల బెస్తలు ఎస్టీలుగా ఉన్నారని, ఆంధ్ర ప్రదేశ్‌తో సహా మరో ఐదు రాష్ట్రాల్లోనే బీసీలుగా ఉన్నామని వారు వివరించారు. పలువురు రాష్ట్ర మంత్రులకు కూడా విన్నవించామని, పాదయాత్రలో జగన్మోహన్‌రెడ్డికి విన్నవించగా హామీ ఇచ్చారని, అయినా అమలుకు నోచుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

### కాపుల రిజర్వేషన్‌ను మరిచిన పాలకులు :

రాష్ట్రంలో దాదాపు 25శాతం మంది జనాభాగా ఉన్నామని చెబుతున్న కాపులు నాలుగు దశాబ్దాలుగా తమను బిసిల జాబితాలో చేర్చాలన్న ఉద్యమాలు ఉవ్వెత్తున నిర్వహించగా అందరూ హామీలిచ్చారే తప్ప అమలుకు నోచుకొనకపోగా ఈ అంశం మరుగునపడిందని, మళ్లీ ఉద్యమానికి సిద్ధం కావాల్సిన ఆవశ్యకత ఏర్పడిందని కాపు సంఘ నాయకులు పలువురు చెబుతున్నారు. రాష్ట్రంలో ఎన్నికల్లో కీలకంగా మారుతున్న కాపులు ఎన్నికల అనంతరం కరివేపాకు లాగా అవుతున్నారని వారు అభిప్రాయపడుతున్నారు. అనాదిగా ఎన్నో ఉద్యమాలు జరిగినా కాపుసంఘ నాయకుడు, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం దాదాపు 20లక్షల మందితో మహోద్యమం, దీక్ష నిర్వహించగా నాటి ప్రభుత్వం ఉద్యమాన్ని అణగదొక్కిందని, దీక్షను భగ్నం చేశారని, హింసాత్మకంగా వ్యవహరించారని, అక్రమ కేసులు బనాయించారని వారు ఆవేదనతో చెబుతున్నారు. అయితే గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్ర ప్రభుత్వం నుండి ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రకటించిన ఇబిసిలకు 10శాతం రిజర్వేషన్‌లో 5 శాతం కాపులకు కేటాయించేలా నిర్ణయించి ఈ మేరకు చట్టబద్ధత కల్పించాలని కేంద్రానికి పంపారని, అనంతరం అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆ అంశాన్ని కనుమరుగు చేశారని వారు చెబుతున్నారు. గతంలో ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య కాపులకు బిసి రిజర్వేషన్ కల్పించగా మద్రాసు రాష్ట్రం నుండి విడిపోయినప్పటి నుండి కాపులపై కుట్రపన్నారని, రిజర్వేషన్ సౌకర్యం రద్దు చేశారని, ఎలాంటి కమీషన్‌లు కూడా లేకుండా రద్దు చేశారని, ఉద్యమించిన కాపులకు కాపుబ్రహ్మానందరెడ్డి, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, ఎన్‌టిరామారావు, నారా చంద్రబాబునాయుడు తదితరులు హామీలిచ్చినా అమలు చేయలేదని, జగన్మోహన్‌రెడ్డి అసలు పట్టించుకొనకుండా నిర్లక్ష్యంగా మాట్లాడారని వారంతా ఆవేదనతో చెబుతున్నారు. రాష్ట్రంలో 1910నుండి 1956 వరకు, 1961 నుండి 1966 వరకు తెలగ, బలిజ, కాపులు బిసిల జాబితాలో ఉండేవారని, అనంతరం ఎలాంటి కమీషన్‌ల నివేదికలు లేకుండానే రద్దు చేశారని, అన్నిరంగాల్లో వెనుకబడిన కాపు, బలిజ, తెలగ, ఒంటరి సంఘీయులు బిసిల జాబితా నుండి తొలగించినందున విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కోల్పోతున్నారని, ఎన్ని ఉద్యమాలు నిర్వహించినా ఫలితం లేకపోయిందని, ఎవరూ కనికరించలేదని కాపులు తీవ్ర మనోవేదనతో ఉన్నారు. తమ రిజర్వేషన్లపై 1995లో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన తీర్పును కూడా అమలు చేయనందున తాము తీవ్రంగా నష్టపోతున్నామని, తమ కాంక్ష నెరవేరడంలేదని, ఉద్యమాలు చేసి అలసిపోయామంటున్నారు.

### వాల్మీకి/బోయల రిజర్వేషన్ కలలు కళేనా..

ఎలాంటి కులవృత్తులు లేక, పేదరికంతో అలమటిస్తున్న రాష్ట్రంలోని వాల్మీకిబోయ కులస్థులను ఎస్టీల జాబితాలో చేర్చాలంటూ ఎన్నో ఉద్యమాలు చేసినా, ఎందరో నాయకులు హామీలిచ్చినా అమలుకు నోచుకొనక తీవ్రంగా అవస్థలుపడుతున్నామని వాల్మీకి సంఘ జిల్లా అధ్యక్షుడు నల్లబోతుల వెంకటేశ్వర్లు తదితరులు తీవ్రావేదనతో చెబుతున్నారు. రాష్ట్రంలో దాదాపు 40లక్షలమంది తమ సామాజికవర్గానికి చెందినవారుండగా అత్యధికశాతం నిరుపేదలని చెబుతున్నాడు. తమ కులాన్ని ఎస్టీలజాబితాలో చేర్చాలంటూ విన్నపాలు చేసినా, ఆందోళనలు చేసినా ఫలించలేదని, దారిద్ర్యం అనుభవిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో ఏజెన్సీ, మైదానంలుగా విభజించి తమ సామాజిక వర్గీయులను ఏజెన్సీలో ఎస్టీలుగా, మైదానంలో బిసిలుగా పరిగణిస్తున్నారని ఆయన తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్రమోడికి కర్నూలులో వినతి పత్రం అందజేయగా, తమను ఎస్టీలజాబితాలో చేరుస్తామని హామీ ఇచ్చారని, గతంలో రాష్ట్ర మంత్రులు పొంగూరు నారాయణ, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కాలువ శ్రీనివాసులు తదితరులకు, అనేక మంది ఉన్నతాధికారులకు వినతి పత్రాలిచ్చామని, గత ఎన్నికలకు ముందు పాదయాత్రలో జగన్మోహన్‌రెడ్డికి విన్నవించగా తాను అధికారంలోకి వచ్చిన తొలి అసెంబ్లీ సమావేశంలోనే ప్రతిపాదించి కేంద్రానికి పంపుతానని హామీ ఇచ్చినా అమలుకు నోచుకోలేదని నల్లబోతుల ఆవేదనతో తెలిపారు. మొత్తం మీద రిజర్వేషన్ కోరుకుంటున్న కాపులు, బెస్తలు, బోయలు ఉద్యమాలు చేసి చేసి హామీలు విని విని అలసిపోయారు. రాష్ట్రంలో ఏర్పడిన ఎన్‌డిఏ ప్రభుత్వంలోనైనా తమ ఆశలు తీర్చాలని వారు కోరుతున్నారు.



డిల్లీలో ధర్నా చేస్తున్న బెస్త సంఘీయులు (ఫైల్ ఫోటో)







# కనుమరుగవుతున్న చిరుధాన్యాలు

*(మొదటి పేజీ తరువాయి)*

ఆదరణ అధికమై ధరలు కూడా ఆకాశాన్నంటుతున్నాయి. ఇతర ప్రాంతాల నుండి వాటిని తెచ్చుకోవాల్సి వస్తోంది. గతంలో జొన్న, రాగి, సజ్జ సంగటి భుజించేవారు పేదరికంతోనేనని, అనాగరికులని అధికంగా భావించేవారు. నేడు ధనికులే వాటిని ఆదరిస్తుండడం, రెస్టారెంట్లలో, విందుల్లో సైతం రాగిసంగటి సరఫరా చేస్తుండడం, జొన్న, సజ్జ రొట్టెలను కూడా పలువురు ఆదరిస్తుండడంతో వాటి గిరాకీ కూడా అధికంగానే ఉంది. అయితే మారిన పరిణామాలకు అనుగుణంగా ప్రభుత్వపరంగా ఈ పంటల సాగుకు ప్రోత్సాహం కరువైందని సర్వత్రా భావిస్తున్నారు. ఆదరణ పెగిరిన ఈపంటల సాగు ఆత్మకూరు ప్రాంతంలో పరిశీలిస్తే కేవలం 10శాతం కూడా లేదని సంబంధిత అధికారులే పేర్కొన్నారు. ప్రభుత్వం ముమ్మరంగా చిరుధాన్యాల పంటల సాగుకు విరివిగా రాయితీలిచ్చి రైతులను ప్రోత్సహించి ఈ పంటలకు గత వైభవం తేవాల్సిన అవసరం ఉందని, దాంతో పాటు ప్రకృతి వ్యవసాయాన్ని కూడా ఈ పంటల ద్వారా ప్రోత్సహించి ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహార పంటలు అందించేలా చర్యలు తీసుకోవాలని సర్వత్రా అభిప్రాయపడుతున్నారు.

## సీఎం చంద్రబాబును కలిసిన మేకపాటి దంపతులు



**జలదంకి, మేజర్ న్యూస్ :** రాష్ట్ర ముఖ్యమంత్రి తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడును శని వారం అమరావతిలోని ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయం లో ఉదయగిరి నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ మేకపాటి శాంతికుమారి ఇరువురు చంద్రబాబు నాయుడును కలిసి పుష్పగుచ్చం శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.

# సోమిరెడ్డి గెలుపుతో మొక్కలు తీర్చుకున్న టీడీపీ నాయకులు

**పెంచలకోనలో 1500 టెంకాయలు కొట్టిన పొదలకూరు టీడీపీ నాయకులు డేగా యశ్వంత్ రెడ్డి**



**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** సోమిరెడ్డి గెలుపుతో పెంచలకోనలో 1500 టెంకాయలు కొట్టి ముక్కు తీర్చుకున్న టిడిపి యువనాయకుడు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. రాజకీయాలంటే సోమిరెడ్డిని చూసి నేర్చుకోవాలని రాష్ట్ర రాజకీయాల్లో హుందాతనానికి మా నాయకుడు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి హెూండా తనానికి నిదర్శనమని అన్నారు. ఎన్ని జన్మలెత్తిన మా నాయకుడిలా రాజకీయాలు చేయాలంటే ఎవరైన తలక్రిందులుగా తపస్సు చేయాల్సిందే అని జగన్ ఐదేళ్ళకే రాష్ట్రాన్ని రావణ కాష్టలా చేశారని ఇక ఆంధ్రా ప్రజలు జగన్‌ని జన్మలో నమ్మురూ అని తెలిపారు. జగన్ మీద కేసు కట్టడం రాజ్యాంగ్యానికే విరుద్ధమని కాకాణి మాట్లాడడం సిగ్గుచేటుగా ఉందని చంద్రబాబు నాయుడిని అరెస్టు చేసి జైలుకు పంపినప్పుడు ఈ రాజ్యాంగం ఏమైందో తెలపాలని కోరారు. మాజీ మంత్రి కాకాణికి సర్వేపల్లి ప్రజలు బాగానే బుద్ధి చెప్పారు అని ఇకనైనా పద్ధతి మార్చుకోవాలని హితువు పలికారు. ఒక్క అవకాశం అంటూ వచ్చిన జగన్మోహన్ రెడ్డి ఇక జీవితంలో అవకాశమే లేకుండా చేసుకున్నారు. ఇప్పటికైనా వైసీపీ నాయకులు మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు పద్ధతిగా మాట్లాడడం నేర్చుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గార్ల యశ్వంత్, జయచంద్ర, గిరి, రాధా, కార్తీక్ పాల్గొన్నారు.

# బీచ్ కబడ్డీ పోటీల పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి





**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** ఆగస్టు 2, 3, 4 తేదీల్లో ఇందుకూరుపేటలోని ఎంకేఆర్ హైస్కూల్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న 11వ ఆంధ్ర రాష్ట్ర బీచ్ కబడ్డీ పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆవిష్కరించారు. శనివారం నెల్లూరులోని వి.పి.ఆర్ నివాసంలో కబడ్డీకి సంబంధించి పోస్టర్‌ను ఆవిష్కరించిన ఆమె అనంతరం మాట్లాడారు. ఆగస్టు 2, 3, 4 తేదీల్లో జరిగే ఈ పోటీలను ప్రజలందరూ విజయవంతం చేయాలన్నారు. ప్రతి రోజు సాయంత్రం 4 గంటలకు కబడ్డీ పోటీలు ప్రారంభం అవుతాయని తెలిపారు. ఫ్లడ్‌లైట్ల వెలుతురులో కబడ్డీ పోటీలు జరుగుతాయని, క్రీడాభిమానులు తప్పకుండా పోటీలు విజయవంతం అయ్యేలా కృషి చేయాలన్నారు. ఇలాంటి పోటీల వల్ల గ్రామస్థాయిలో ఉన్న ప్రతిభ రాష్ట్ర స్థాయికి తెలుస్తుందన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దువ్వూరు కల్యాణ్ రెడ్డి, కోడూరు కమలాకర్‌రెడ్డి, బెజవాడ వంశీకృష్ణా రెడ్డి, వీరేంద్రనాయుడు, చెంచు కిషోర్, పముజుల రవి, శ్రీనివాస్, కిరణ్, హరీష్, విజయ్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

# గృహనిర్మాణ బకాయిలు హుళక్కేనా?



పునాదుల్లో ఆగిన గృహనిర్మాణం

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు నియోజకవర్గంలో గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వం మంజూరు చేసిన పక్కాగృహాలకు సంబంధించి బకాయిలు ఇక హుళక్కేనా అని పలువురు చర్చించుకుంటున్నారు. 2014లో ఏర్పాట్కైన ప్రభుత్వం తొలుత రాష్ట్ర విభజనతో గృహనిర్మాణానికి సంబంధించి ప్రత్యేక ఆన్‌లైన్ ఖాతాలు ఏర్పడనందున బిల్లుల చెల్లింపు నిలిచిపోయిందని అప్పట్లో అధికారులు చెబుతుండేవారు. అప్పట్లో నూతన ప్రభుత్వం ఏర్పడ్డాక నియోజకవర్గంలో 19,239 గృహాలు పూర్తికాగా 3815 గృహాలు వివిద దశల్లో ఉండేవి. 9242మంది గృహాల నిర్మాణాలు ప్రారంభించలేదని తెలిపారు. 2014 లో టీడీపీ ప్రభుత్వం ఏర్పడగా వివిద కారణాలతో మూడేళ్ళ తరువాత గృహనిర్మాణ కార్యక్రమం ఆరంభమైంది. అప్పటికే ఆత్మకూరు మండలంలో 150గృహాల నిర్మాణాలు నిలిచిపోగా దాదాపు 50లక్షల రూపాయల బకాయిలుండేవి. అశ్వనీపురం గిరిజనకాలనీలో 14ఇళ్ళ నిర్మాణం నిలిచిపోయి ఈనాటికీ పునాదులకే పరిమితమై కన్పిస్తున్నాయి. వారికి బిల్లులు చెల్లించనందున నిర్మాణం కొనసాగించలేక పూరిగుడిసెల్లో జీవనం సాగిస్తున్నారు. నాలుగు చినుకులు పడినా తమ అవస్థలు వర్ణనాతీతంగా ఉంటా యని వారు వాపోతున్నారు. తాము నిరుపేదలం కావడంతో స్వంతంగా ఈ గృహాలను నిర్మించుకోలేకున్నామని వారు చెబుతుంటారు. గతంలో గృహాల నిర్మాణాలు పూర్తిచేసిన పలువురికి తుదిబిల్లు కూడా రాలేదని చెబుతున్నారు. నియోజకవర్గంలోని ఆరుమండలాల్లో దాదాపు 3కోట్ల రూపాయల బకాయిలున్నాయని అప్పట్లో అధికారులు తెలిపారు. నేటి అధికారులను ఆ బకాయిల గురించి అడుగగా ఇంకా చెల్లించలేదని పేర్కొన్నారు. 2019లో ఏర్పడిన వైసిపి ప్రభుత్వం ఆ ఊసే పట్టించుకోలేదు. ఏళ్ళు గడిచిపోతున్నా ఆ బకాయిల గురించి ఎవరూ పట్టించుకోనందున ఇక హుళక్కే అని పలువురు అభిప్రాయ పడుతున్నారు. ఈ నూతన ప్రభుత్వమైనా ఆ గిరిజనుల గృహనిర్మాణ బకాయిల విషయంపై దృష్టి సారించాలని వారు కోరుతున్నారు.

## ప్రభుత్వ సంగీత, నృత్య పాఠశాలలో

# అడ్మిషన్లు ప్రారంభం

**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** నగరంలోని డాక్టర్ ఎస్పీ బాలసుబ్రమణ్యం ప్రభుత్వ సంగీత నృత్య పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి వివిధ కోర్సులలో ప్రవేశాలకు అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ప్రిన్సిపల్ సి.జ్యోతిర్మయి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు దరఖాస్తు రుసుము 50/-రూపాయలు చెల్లించి పాఠశాలలో అందుబాటులోనున్న గాత్రం సంగీతం, వైలెన్, భరతనాట్యం, మృదంగం, డోలు వంటి విభాగాలలో చేరవచ్చని ఆమె తెలిపారు.నాలుగేళ్ల కాల పరిమితి తో సర్టిఫికెట్ కోర్సు అలాగే సర్టిఫికెట్ కోర్సు ఉత్తీర్ణులైన వారు రెండేళ్ల కాలపరిమితితో డిప్లొమా కోర్సు చేయడానికి అర్హులని ఆమె వివరించారు. సర్టిఫికెట్ కోర్సులో చేరేందుకు 01.07. 2024 నాటికి పదిసంవత్సరాల వయసు నిండి ఉండాలన్నారు. విద్యార్థులకు, గృహిణులకు, ఉద్యోగులకు అనువైన సమయాల్లోనే పాఠశాలలో శిక్షణ ఉంటుందని ఆసక్తి కలవారు ఇతర వివరాలకు ఆర్టీసీ బస్టాండ్ సమీపానగల డిఎస్ఆర్ కళ్యాణమండపం ప్రక్కనగల డాక్టర్ ఎస్పీ బాలసుబ్రమణ్యం ప్రభుత్వ సంగీత, నృత్య పాఠశాల ఎస్పీఎస్ఆర్ నెల్లూరు నందు దరఖాస్తులు పొందవచ్చని తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఆగస్టు 31వ తేదీలోగా పాఠశాలలో అందజేయాలన్నారు. 0861-2328285, 9000786599 ఫోన్ నంబర్ల ద్వారా వివరాలు తెలుసుకోవచ్చని ప్రిన్సిపల్ జ్యోతిర్మయి తెలిపారు.

# విద్యార్థులకు బహుమతులు ప్రదానం



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి మండలంలోని గండిపాలెం గురుకుల పాఠశాల యందు 2024 పదో తరగతి ఫలితాల్లో మొదటి మూడు ర్యాంకులు సాధించిన విద్యార్థులకు పూర్వ విద్యార్థుల సంఘం ఏఏఏజీ ఆధ్వర్యంలో శనివారం బహుమతులు ప్రధానం చేయడం జరిగింది. మొదటి ర్యాంకు సాధించినటువంటి ఎన్.వేణుకి మొదటి బహుమతి పదివేల రూపాయలు రెండో బహుమతి బి.చైతన్యకి 7500 మూడో బహుమతి ఇద్దరు శివాజీ హర్షవర్ధన్ లకు ఒక్కొక్కరికి 5000 నగదు బహుమతులు అలాగే మెమంటోలు ప్రధానం చేయడం జరిగింది. వారికి మంచి భవిష్యత్తు ఉండాలని బాగా చదువుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఏఏజీ సభ్యులు షారన్ సుమన్ కిషన్ గాజులపల్లి సుబ్బారెడ్డి పాఠశాల ప్రిన్సిపల్ పుష్పరాజు అలాగే ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# హాస్టల్ విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు

**జలదంకి, మేజర్‌న్యూస్ :** జలదంకి ప్రభుత్వ బాలుర బీసీ వసతి గృహాన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఏ.శ్రీనివాసులు సందర్శించారు. శనివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ప్రభుత్వ బాలుర బీసీ వసతి గృహంనందు వైద్యాధికారి డాక్టర్ ఏ.శ్రీనివాసులు విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి చిన్నచిన్న వ్యాధులైన జలుబు, దగ్గు, గాయాలు, జిలలకు చికిత్స అందించారు. ఈ సందర్భంగా సీజనల్‌గా వచ్చే వ్యాధులైన డయేరియా, దోమకాటు వలన వచ్చే జ్వరాలు మలేరియా డెంగ్యూ, చికెనుగుణ్య, బోదకాలు మొదలగు వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెల్త్ ఎడ్యుకేటర్ హరిప్రసాద్ మాట్లాడుతూ వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రత, స్వచ్ఛమైన నీరు, పౌష్టికాహారము తీసుకోవడం ద్వారా వ్యాధులనుంచి కాపాడుకొనవచ్చని తెలియజేశారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని అవగాహన కల్పించారు. అనంతరం హాస్టల్ గదులను, వంటరూము, టాయిలెట్స్ పరిశీలించి తగు సూచనలను చేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ ఎస్.వెంకటేశ్వర్లు, ఏఎన్ఎం శాంతకుమారి, ఆశా కార్యకర్త మానస పాల్గొన్నారు.



# కొండ బిట్రగుంట స్వామి వారి వద్దకు తిరువీధి ప్రసాద్ పాదయాత్ర



**బోగోలు, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు తిరువీధి ప్రసాద్ కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి పై ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు. కావలి నుండి కొండ బిట్రగుంట ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థానం వరకు పాదయాత్ర చేపట్టారు. దగుమాటి వెంకట కృష్ణారెడ్డి కావలి ఎమ్మెల్యేగా 2024 ఎన్నికలలో అఖండ మెజారిటీతో గెలుపొందితే తాను కొండ బిట్రగుంట స్వామివారి వద్దకు పాదయాత్ర చేస్తానని మొక్కుకున్నట్లు ఆయన తెలిపారు. కావలి కచేరి మిట్ట వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం నుండి ప్రారంభమైన పాదయాత్రలో ఎమ్మెల్యే కృష్ణారెడ్డి కొంత దూరం తనతో పాటు పాదయాత్ర చేశారని చెప్పారు. ఆలయానికి చేరుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. తిరువీధి ప్రసాద్ పాదయాత్రకు సంఘీభావంగా జబర్దస్త్ ఆర్టిస్ట్ శాంతి స్వరూప్ పాదయాత్రలో పాల్గొన్నారు. బోగోలు మండలం టిడిపి మండల అధ్యక్షులు మాలేపాటి నాగేశ్వరరావు బోగోలు మండలం ముంగమూరు ఆర్చి వద్ద తిరువీధి ప్రసాద్ పాదయాత్రకు సంఘీభావం తెలుపుతూ కొండ బిట్రగుంట దేవాలయానికి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో లేలపల్లి సుధీర్, పైడి హర్ష, ఆవుల సురేష్, వేణు, కట్టుపల్లి సింహాద్రి, చిలకపాటి జానకిరామయ్య, టిడిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# హాస్టల్ విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు



**జలదంకి, మేజర్‌న్యూస్ :** జలదంకి ప్రభుత్వ బాలుర బీసీ వసతి గృహాన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఏ.శ్రీనివాసులు సందర్శించారు. శనివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ప్రభుత్వ బాలుర బీసీ వసతి గృహమునందు వైద్యాధికారి డాక్టర్ ఏ.శ్రీనివాసులు విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి చిన్నచిన్న వ్యాధులైన జలుబు, దగ్గు, గాయాలు, జిలలకు చికిత్స అందించారు. ఈ సందర్భంగా సీజనల్‌గా వచ్చే వ్యాధులైన డయేరియా, దోమ కాటు వలన వచ్చే జ్వరాలు మలేరియా డెంగ్యూ, చికెనుగున్య, బోదకాలు మొదలగు వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెల్త్ ఎడ్యుకేటర్ హరిప్రసాద్ మాట్లాడుతూ వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రత, స్వచ్ఛమైన నీరు, పౌష్టికాహారము తీసుకోవడం ద్వారా వ్యాధులనుంచి కాపాడుకొనవచ్చని తెలియజేశారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని అవగాహన కల్పించారు. అనంతరం హాస్టల్ గదులను, వంట రూము, టాయిలెట్స్ పరిశీలించి తగు సూచనలను చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ ఎస్.వెంకటేశ్వర్లు, ఏఎన్ఎం శాంతకుమారి, ఆశా కార్యకర్త మానస పాల్గొన్నారు.

## 24 గంటల్లో రోడ్డు సమస్య పరిష్కారం

**ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన గ్రామ ప్రజలు**



**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** బుచ్చిరెడ్డి పాలెం చెన్నూరు రోడ్డు రేబాల కాలువపై నిర్మించిన పురాతన కల్వర్టు రోడ్డుపై వర్షపు నీరు చేరి ఏర్పడిన గుంతలలో నిలిచి నీరుతో వాహన దారులకు తీవ్ర ఇబ్బంది కల్గిస్తుంది. దింతో స్థానిక ప్రజలు కమిషనర్ రమణబాబు దృష్టికి తీసుకవెల్లడంతో వెంటనే పరిస్థిని సమిక్షించి ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డికి తెలుపడంతో వెంటనే అధికారులకు రోడ్డు పనులు చేపట్టాలని ఆదేశించారు. దీంతో శుక్రవారం రాత్రి నుంచే వారం రోడ్డు పనులు ప్రారంభించారు. దీంతో బుచ్చి నగర ప్రజలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఉపాధిహామీ పనుల సామాజిక తనిఖీ



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మండలంలో ఆదివారం నుండి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా జరిగిన పనుల సామాజిక తనిఖీ జరుగుతుందని మండల ఎన్ఆర్ఈజిఎస్ ఏపివో ఎం.శిరీష పేర్కొన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశం మందిరంలో ఎండివో బాలాజీనాయక్ ఆధ్వర్యంలో ఈసి డి.జానకి అధ్యక్షతన సోషల్ ఆడిట్ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో స్టేట్ రిసోర్స్ పర్సన్ ఎం.నాగార్జున మాట్లాడుతూ.. 2023-24 ఆర్థిక సంవత్సరంలో మండలంలోని అన్ని పంచాయతీల్లో 10.72కోట్ల రూపాయల పనులు జరిగాయన్నారు. ఈ పనులను ఆడిట్ బృందాలు అన్నిచోట్లా పరిశీలించి నివేదికలు రూపొందిస్తారన్నారు. అన్ని గ్రామాలు సోషల్ ఆడిట్ పూర్తయ్యాక మండల స్థాయిలో ఓపెన్ ఫోరమ్ నిర్వహిస్తామని నాగార్జున పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్పిలు, ఉపాధిహామీ ఈసి, టిఈ, ఎఫ్ఏలు, సిబ్బంది పాల్గొన్నారు.

## సోమశిల ప్రాజెక్టు వద్ద ముమ్మర ఏర్పాట్లు



**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** సోమశిల ప్రాజెక్టు వద్ద ఆదివారం మంత్రులు రానున్న నేపథ్యంలో అధికారులు స్వాగత ఏర్పాట్లు చేశారు. రోడ్డుకు ఇరువైపులా దట్టంగా ఉన్న కంప చెట్లను తొలగించారు. టీడీపీ నాయకులు భారీ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. సోమశిల ఎస్ఐ వి.సుబ్బారావు ప్రాజెక్ట్ పరిసర ప్రాంతాలను నిశితంగా పరిశీలన చేశారు. పోలీస్ బందోబస్తు ఏర్పాటుకై ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ప్రతి వాహనాన్ని హ్యాపీ పరిశీలిస్తున్నారు. ఇటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఇప్పటికే ఉన్నతాధికారులు స్థానిక పోలీస్ అధికారులకు తగు ఆదేశాలు చేసి ఉన్నారు. ముగ్గురు మంత్రులు సోమశిల ప్రాజెక్టును సందర్శించనున్న నేపథ్యంలో భారీజన సందోహం ఉండనున్నది.

## నారాయణ క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతి కార్యక్రమం



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** శ్రీ పొంగూరి నారాయణ క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు ముఖ్య అతిథులుగా హాజరైన మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరి నారాయణ సతీమణి రమాదేవి ట్రోఫీని, బహుమతులు అందజేశారు. నెల్లూరు సిటీ, విఆర్ కాలేజీ నందు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు అన్నంగి ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ చివరి రోజున విజేతలుగా నిలిచిన ప్లేయర్స్‌కు ముఖ్యఅతిథులుగా విచ్చేసిన పొంగూరు నారాయణ సతీమణి రమాదేవి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వారితో జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ సతీమణి విజయలక్ష్మి, తెలుగుదేశం నాయకురాలు గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

## భక్తులకు ఎటువంటి ఇబ్బందులు రానివ్వం



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన బారాషాహీద్ రొట్టెల పండుగకు లక్షలాదిమంది భక్తులు వచ్చే అవకాశం ఉండడంతో వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఈ ఏడాది అత్యంత పగడ్బందీగా ఏర్పాట్లను చేశారు. చెరువు వద్ద మౌలిక వసతులు, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు, విద్యుత్ లైట్లు, వర్షం వస్తే ఉండేందుకు వసతి ఏర్పాట్లు తదితర అంశాలను జనసేన కమిటీ సభ్యులతో కలిసి బారాషహీద్ దర్గా చైర్మన్ షేక్ ఖాదర్ బాషా, దర్గా కమిటీ ప్రధాన కార్యదర్శి ఎండి కరిముల్లా, కార్యదర్శి షేక్ మునీర్ భాష, ఆర్గనైజింగ్ కార్యదర్శి కరీం, అక్బర్, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు షేక్ లాల్ మస్తాన్ తదితరులు దగ్గరుండి పరిశీలించారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, జిల్లా మంత్రుల సహకారంతో రొట్టెల పండగను ఈసారి అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు.

# చదువుతోనే సమాజంలో ఉన్నత స్థానం

- 212 మంది విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు
- కుమ్మర శాలివాహన సంఘం రాష్ట్ర అధ్యక్షులు




**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** చదువుతోనే నేటి విద్యార్థులు అత్యున్నత స్థానాలకు చేరుకుంటారని నెల్లూరు జిల్లా కుమ్మర శాలివాహన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఐలాపురం భాస్కర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గం పరిధిలోని కొత్తూరులోని కుమ్మర శాలివాహన సంఘం కళ్యాణమండపంలో శనివారం శాలివాహన పిల్లలకు ప్రతిభా పురస్కారాల కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యతోనే సమాజంలో మార్పు సాధ్యమన్నారు. కుమ్మర కులస్తులు అందరూ తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని ఆయన పిలుపునిచ్చారు. కుమ్మర శాలివాహన సంఘం జిల్లా అధ్యక్షులు నరసయ్య మాట్లాడుతూ 2013 సంవత్సరం నుంచి పదవ తరగతి, ఇంటర్లో 75శాతం మార్కులు సాధించిన విద్యార్థులకు క్రమం తప్పకుండా ప్రతిభా పురస్కారాలను అందజేస్తున్నామన్నారు. ఈ ఏడాది 150 మంది పదవ తరగతి విద్యార్థులకు 75మంది ఇంటర్ విద్యార్థులకు మొత్తం 225 మందికి ప్రతిభా పురస్కారాలను అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో కుమ్మర శాలివాహన సంఘం రాష్ట్ర నేత జరుగుమల్లి శ్రీనివాసరావు, కృష్ణాజిల్లా అధ్యక్షులు బి.శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు అద్దంకి సుబ్బారావు, రాష్ట్ర కార్యనిర్వాహణ కార్యదర్శి మొగిలిచర్ల సుబ్బారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పెల్లూరి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# పాత పెన్షన్ విధానం అమలు చేయాలి



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఉద్యోగులకు సీపీఎస్ పెన్షన్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని యుటిఎఫ్ నాయకులు కోరారు. ఉద్యోగులకు సిపిఎస్ పెన్షన్ పథకం రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామనే హామీతో అధికారంలోకి వచ్చిన గత జగన్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సిపిఎస్ రద్దు మాట గాలికి వదిలేసి అంతకంటే మోసపూరితమైన జిపిఎస్‌ను అమలు చేస్తామని చెప్పిందన్నారు. నేడు స్పెషల్ చీఫ్ సెక్రటరీ పేరుతో జులై 12వ తేదీన అక్టోబర్ 20 నుండి గత ప్రభుత్వం ప్రతిపాదించిన జిపిఎస్ పెన్షన్ పథకం అమల్లోకి వస్తుందని గజిట్ విడుదల చేశారు. దీనిని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఆత్మకూరు ప్రాంతీయ ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ కార్యాలయము దగ్గర ఈ జీవో 54 ప్రతులను దగ్ధం చేసి యుటిఎఫ్ తీవ్ర నిరసనను వ్యక్తం చేసింది. వెంటనే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ జీవో విడుదలను రద్దు చేయడమే కాకుం డా వెంటనే సిపిఎస్ పెన్షన్ పథకాన్ని రద్దుచేసి పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరించాలని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు, ఏఎస్‌పేట, అనంత సాగరం ప్రాంతీయ మండలాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ వాటర్ ప్లాంట్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- కేశవుల నగర్‌లో వాటర్ ప్లాంట్ పున:ప్రారంభం



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ నియోజకవర్గం పరిధిలోని 28వ డివిజన్‌లో వాటర్ ప్లాంట్‌ను టిడిపి నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక కార్పొరేటర్ చెక్క అహల్య, సాయి సునీల్ ఆధ్వర్యంలో స్థానిక ప్రజల అవసరాలకు అనుగుణంగా ఈ ప్రాంతంలో ప్రభుత్వ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. దీనిని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి దొడ్డపునేని రాజా నాయుడు మాట్లాడుతూ.. తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు తాను కార్పొరేటర్‌గా ఉన్న సమయంలో ఈ ప్రాంతంలో వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశామని కానీ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలు దీనిని నిర్లక్ష్యం చేసిన కారణంగా మూలన పడిందన్నారు. తిరిగి ప్రస్తుత టిడిపి హాయంలో దీనికి మరమ్మతులు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ నంది మండలం భాను శ్రీ, శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థాన ఉత్సవ కమిటీ మాజీ చైర్మన్ అలహరి విజయ్ కుమార్, కాసా వరప్రసాద్ నాయుడు, దొరబాబు, కనకట్ల రఘురాం ముదిరాజ్, బిజెపి నేత మొగరాల సురేష్, జనసేన నేత రాపూర్ సుందర్ రామిరెడ్డి పలువురు టిడిపి నేతలు పాల్గొన్నారు.

## విఓఏల కాలపరిమితిని రద్దు చేయాలి



**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రమైన అనంతసాగరంలోని వెలుగు కార్యాలయంలో శనివారం విఓఏతో సిఐటియు నాయకులు సమావేశం నిర్వహించారు. మండల కార్యదర్శి అన్వర్ భాష మాట్లాడుతూ.. వెలుగు వివోఏలకు మూడు సంవత్సరాల కాల పరిమితి ఉండే ప్రభుత్వ జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వారికిచ్చే వేతనాలు సంఘ బంధం ఖాతాలలో కాకుండా, వ్యక్తిగత అకౌంట్లో వేయాలని కోరారు. స్కీం వర్కర్ల మీద రాజకీయ వేధింపులు ఎక్కువయ్యాయని వాటిని నివారించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కర్షక, కార్మిక సంఘాల సిబ్బంది హక్కుల సాధనకు సిఐటియు ఎల్లవేళలా పోరాటాలు చేస్తుందని, మద్దతుగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు.

## గండికోట మట్టిమనుషులుకు పురస్కారం



**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** బుచ్చిరెడ్డిపాలెం నగర పంచాయతీలోని రామచంద్రాపురం ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు, కవి, రచయిత గండికోట సుధీర్ కుమార్ సాహితీ పురస్కారం అందుకున్నారు. శనివారం పురమందిరంలో పెన్నా రచయితల సంఘం 15వ వార్షికోత్సవ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయ తెలుగు శాఖాధిపతి డాక్టర్ మేడిపల్లి రవికుమార్, కృష్ణపట్నం ఏపీ జెన్కోవిజిలెన్స్ డిఎస్పి శ్రీనివాసులు, పెన్నా రచయితల సంఘం కార్యనిర్వాహకులు గోవిందరాజుల సుభద్రా దేవి, అవ్వారు శ్రీధర్ బాబు తదితరులు నగదు, ప్రశంసాపత్రం అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గండికోట రచించిన 'మట్టి మనుషులు' కవిత ప్రతి ఒక్కరి మదిని తాకిందన్నారు.

## అసత్య కథనాలు మానుకోవాలి



**విడవలూరు, మేజర్‌న్యూస్ :** ఉద్దేశపూర్వకంగా రాసి అసత్య కథనాలు మానుకోవాలని మండలంలోని వరిని గ్రామ సర్పంచ్ రావెళ్ల మల్లికార్జున రావు హితవు పలికారు. ఈ సందర్భంగా ఆయన పంచాయతీ కార్యాలయం వద్ద విలేకరుల సమావేశం నిర్వహించారు. తమ పంచాయతీ పరిధిలో పారిశుధ్య పనులు వీధిలైట్ల నిర్వహణ జరుగుతుంటే దీనిపై అసత్య కథనాలు ప్రచురించడం తగదన్నారు. అలాగే ఇంటి పన్ను కొళాయి పన్ను వసూలు చేసి స్వాహా చేస్తున్నట్లు కూడా అసత్య కథనాలు జరిగిందని దీనిపై తాము ఎక్కడా కూడా నిధులు స్వాహా చేయలేదని నిరూపించుకునేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు వెంకయ్య గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## తెల్లరాయి తవ్వకాలపై సీసీఎస్ పోలీసుల విచారణ

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి మండలంలో తెల్లరాయి తవ్వకాలు, అక్రమ రవాణాపై శనివారం సీసీఎస్ పోలీసులు విచారణ చేపట్టారు. మండలంలోని మాసాయిపేట, కొండాయపాళెం అప్ప సముద్రం, ఆర్లపడియ, కృష్ణంపల్లి, తిరుమలాపురం తదితర గ్రామాల్లో తెల్లరాయి తవ్వకాలు, అక్రమ రవాణాపై ఓ వ్యక్తి రాష్ట్ర డీజీపీకి ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాల మేరకు సీసీఎస్ సీఐ సాంబశివరావు, ఏఎస్ఐ రవిలు స్థానిక పోలీసేస్టేషన్లో తెల్లరాయి తవ్వకాలు, అక్రమ రవాణాపై ఏమైనా కేసులు నమోదయ్యాయా అని ఆరా తీశారు. తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు నెహ్రూబాబుతో చర్చించారు. మండ లంలోని ప్రభుత్వ భూముల్లో ఎక్కడైనా తెల్లరాయి తవ్వకాలు జరిగిన సంఘటనలపై ఆరా తీయడంతోపాటు లీజు క్వారీల వివరాలను సేకరించారు.

## చిరమన గ్రామంలో చోరీ

**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** ఏఎస్ పేట మండలం చిరమన గ్రామంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగిన సంఘటన చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. చిరమన గ్రామానికి చెందిన కాటంరెడ్డి చిన్న పెంచల రెడ్డి దంపతులు ఇంటి వరండాలో రాత్రి నిద్రించారు. అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని దొంగలు ఇంట్లోకి ప్రవేశించి కవర్లో పెట్టి ఉన్న బంగారు సరుడు, చేతివాచ్ చోరీ చేసి తీసుకెళ్లారని తెలిపారు. సుమారు నాలుగు సవర్ల బంగారు సరుడు చోరీకి గురైందని పెంచల రెడ్డి కుమారుడు జనార్ధన్ రెడ్డి తెలిపారు. పోలీసులకు సమాచారం అందించడంతో సంఘం సీఐ, ఏఎస్పేట ఎస్ఐ ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో వారి సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.